క్లుప్తంగా

ఎస్సెస్సీ టాపర్లకు పురస్కారాలు ప్రదానం



సిరికొండ: మండల కేంద్రంలోని సత్యశోధక్ పాఠశాలలో ఎస్సెస్సీ-2022 టాపర్లను ధర్పల్లి సీఐ సైదా బుధవారం సత్కరించారు. సత్యశోధక్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో టాపర్లుగా నిలిచిన వారికి, పదవ తరగతి ఫలితాల్లో 10/10 జీపీఏ సాధించిన విద్యార్థులకు రావుట్ల చిన్న నర్సయ్య స్మారక పురస్కారం కింద ఒక్కొక్కరికి రూ.2 వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రాలను సీఐ అందజేశారు. జాతీయ జాంబోరిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సీఐ సన్మానించారు. కార్యక్రమంలో ఏఎస్సై బాల్ సింగ్, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బాలయ్య, ప్రిన్సిపాల్ నర్సయ్య పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బూత్ కమిటీల నియామకం



జక్రాన్‌పల్లి: సికింద్రాపూర్, పుప్పాలపల్లి, గన్య తండా, బాలానగర్ గ్రామాల్లో బుధవారం బీఆర్ఎస్ పార్టీ బూత్ కమిటీలను నియమించారు. పార్టీ మండల అధ్యక్షుడు నట్ట భోజన్న ఆధ్వర్యంలో బూత్ కమిటీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కుంచాల విమల, జెడ్పీటీసీ సభ్యురాలు పాట్కురి తనుజాశ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ తిరుపతిరెడ్డి, సర్పంచ్‌లు తలారి గంగామణి, లింగన్న, నిహారిక, ఆర్ఎస్ఎస్ మండల అధ్యక్షుడు దీకొండ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ మైదం రాజన్న, నాయకులు కుంచాల రాజు, అంకం ప్రకాశ్ పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలని పిలుపు



డిచ్‌పల్లి: జక్రాన్‌పల్లిలో ఫిబ్రవరి 2న జరిగే రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని బుధవారం డిచ్‌పల్లి మండల కేంద్రంలో ఐఎఫ్‌టీయు జిల్లా కార్యదర్శి గంగాధర్ పిలుపునిచ్చారు. అనంతరం కార్మికులతో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. గంగాధర్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్మికులు గ్రామంలో ఉన్న చెత్త మురికి కాలువలు తీసి ప్రజలకు దుర్వాసన రాకుండా చేస్తున్నారు కానీ వారు అనారోగ్యం పాలైతే పట్టించుకునే నాథుడే లేడన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ కల్పించాలని, ప్రమాదం జరిగిన వెంటనే రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. రాష్ట్ర మహాసభలకు అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సాయిలు, నవీన్, గంగారాం, సాయిలు రమేష్, బాబవ్వ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ నిర్మాణంలో వెంకట్ రెడ్డి పాత్ర కీలకం

- రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌లో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం చేసిన వారిలో గడ్డం వెంకట్‌రెడ్డి పాత్ర కీలకమని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ అన్నారు. బుధవారం నగరంలోని ఫిట్టర్స్ యూనియన్ ఆఫీసులో కామ్రేడ్ గడ్డం వెంకట్ రెడ్డి ద్వితీయ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ భూనిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని ఉద్యమాలు నిర్వహించారని తెలిపారు. ఆరోగ్యం సహకరించక పోయినా ఉద్యమాలలో పాల్గొని నిరుపేదలకు అండగా వారి సమస్యల పరిష్కారానికి పోరాడిన వ్యక్తి గడ్డం వెంకట్ రెడ్డి అని కొనియాడారు. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో నిరుపేదలందరికీ ఆహార హక్కును సాధించడానికి పోరాడడమే గడ్డం వెంకట్ రెడ్డికి ఇవ్వగలిగే నిజమైన నివాళి అన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, రాష్ట్ర నాయకులు భూమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య, గడ్డం మురళి, సీనియర్ నాయకులు యాదగిరి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ చర్యలు

బాల్కొండ: వరి పంటలో సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని బాల్కొండ వ్యవసాయ అధికారి మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం వన్నెల్(బి)లో వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు వరిలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. వరిలో అగ్గి తెగులు నివారణకు ట్రైసైక్లోజెల్ 120 గ్రాములు లేదా ఐసోప్రతియోనిల్ 400 ఎంఎల్ 200 లీటర్లలో కలిపి ఎకరానికి పిచికారీ చేయాలన్నారు. వరిలో మొగి పురుగు నివారణకు 4జీ గుళికలను 8 కిలోలు చల్లాలన్నారు. యూరియాను మోతాదుకు మించి వాడవద్దన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా
- ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరిక



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఎండీఎం కార్మికులు

సుభాష్‌నగర్: మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి చక్రపాణి మాట్లాడుతూ.. గతేడాది మార్చి 15న కార్మికులకు రూ.2 వేల జీతం పెంచుతున్నట్లు ప్రకటించారని, నేటికీ అమల్లోకి రాలేదని విమర్శించారు. వెంటనే పెరిగిన జీతాన్ని అమలు చేసేలా జీవోను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎండీఎం కార్మికులు అభద్రతా భావంతో ఉన్నారని, ఎన్నో ఏళ్లుగా సమస్యలపై ఉద్యమిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కోడిగుడ్లు ప్రభుత్వమే సరఫరా చేయాలని, వంటపాత్రలు మంజూరు చేయాలన్నారు. ఎండీఎం కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా వర్తింపజేయాలని, ఉచితంగా గ్యాస్ సరఫరా చేయాలని, నాణ్యమైన బియ్యాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెంటనే సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు చామంతి లక్ష్మీ, నిర్వాహకులు, కార్మికులు సుజాత, సాయమ్మ, నాగలక్ష్మీ, సురేందర్‌రెడ్డి, గంగాధర్‌తోపాటు పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

కంఠేశ్వర్ ఆలయానికి రథం సామగ్రి

- వచ్చే రథ సప్తమి నాటికి రథం సిద్ధం
- 28 ఫీట్ల ఎత్తు 11 ఫీట్ల వెడల్పుతో తయారీ
- రాష్ట్రంలో పెద్ద రథం ఇదే



కంఠేశ్వర్ ఆలయానికి చేరుకున్న కొత్త రథం సామగ్రి



కర్రతో చేసిన దేవతల విగ్రహాలు



హంపిలో తయారు చేసిన రథ చక్రాలు

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ నీలకంఠేశ్వర ఆలయానికి కొత్త రథం సామగ్రి చేరుకుంది. గద్వాల జిల్లాలో రథం రూపుదిద్దుకుంది. అక్కడి నుంచి రథం తీసుకురావటం ఇబ్బంది కాబట్టి రథాన్ని విడి విడి భాగాలుగా విడదీసి లారీలో నిజామాబాద్‌కు తరలించారు. బుధవారం రథం సామగ్రి నిజామాబాద్ కంఠేశ్వర ఆలయానికి చేరుకుంది. గద్వాల జిల్లా పెంట్లవెల్లి వాస్తవ్యులు, రథ శిల్పి బైరోజ్ బాల బ్రహ్మచారి చేతుల్లో ఈ రథం రూపుదిద్దుకుంది. రథాన్ని తయారు చేసే పనులు బుధవారం ప్రారంభించారు. ఈ నెల 26న వసంత పంచమి వరకు రథాన్ని సిద్ధం చేసి ప్రారంభించనున్నారు. 28న రథసప్తమి సందర్భంగా నీలకంఠేశ్వరుడిని ఈ కొత్త రథంలో ఊరేగించనున్నట్లు ఆలయ చైర్మన్ బిల్లా మహేష్, ఈవో వేణులు తెలిపారు.

శిథిలావస్థకు చేరుకున్న ప్రస్తుత రథం

ప్రస్తుత రథాన్ని తయారు చేసి 100 సంవత్సరాలు కావస్తుండటంతో శిథిలావస్థకు చేరుకుంది. గత సంవత్సరం రథసప్తమి సందర్భంగా ఊరేగింపులో కొన్ని ఇబ్బందులు తలెత్తటంతో ఈ రథాన్ని ఇక మీదట ఉపయోగించకూడదని ఆలయ కమిటీ నిర్ణయించింది. కొత్త రథం తయారీకి రూ.50 లక్షలు అంచనా వేశారు. ఈ నిధులను భక్తుల నుంచి విరాళాలు స్వీకరించారు. రథం తయారీ కొరకు ఉపయోగించిన కర్ర పేరు పెద్ద వేగిసా. ఇది మహారాష్ట్రలోని అటవీ ప్రాంతంలో లభ్యమవుతుంది. ఈ కర్ర జీవితకాలం వెయ్యి సంవత్సరాలు. ఈ కర్రతోనే కొత్త రథాన్ని తయారు చేస్తున్నారు.

అయిదు అంతస్తుల ఎత్తుకు సమానంగా ..

నీలకంఠేశ్వర ఆలయానికి తయారు చేస్తున్న రథం ఎత్తు సుమారు 28 ఫీట్లు(అయిదు అంతస్తులతో సమానం), వెడల్పు 11 ఫీట్లతో తయారు చేస్తున్నారు. రథంపై వివిధ దేవుళ్ల చిత్రాలను కర్రపైనే చెక్కించారు. వీటిని రథంపై ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఏనుగుల, గుర్రాలను కర్రతోనే తయారు చేశారు. దీనికి కూడ రథంపై ఏర్పాటు చేయనున్నారు. ఈ రథం రాష్ట్రంలోనే అతిపెద్ద రథంగా కీర్తికెక్కనుంది.

ఒక్కో చక్రం టన్ను బరువు..

రథం చక్రాలను హంపి ఆలయానికి ఉపయోగించిన గ్రానైట్‌తో తయారు చేశారు. ఒక్కో చక్రం బరువు ఒక టన్ను బరువు ఉంటుంది. ఈ చక్రాలను కర్నూల్ జిల్లాలోని ఆలూర్ గ్రామంలో తయారు చేశారు. ఈ చక్రాలు నెలరోజుల క్రితమే నిజామాబాద్‌కు చేరుకున్నాయి.

నెలరోజుల్లో పూర్తి రథం సిద్ధం

గద్వాల్‌లోనే రథాన్ని తయారు చేసి రథం విడి భాగాలును నిజామాబాద్‌కు తీసుకొచ్చాం. ఇక్కడే రథాన్ని అసెంబ్లింగ్ చేస్తాం. వచ్చే రథ సప్తమి నాటికి రథం ఊరేగింపునకు సిద్ధం చేస్తాం. ఇది తెలంగాణలోనే అతి పెద్ద రథంగా రూపుదిద్దుకోనుంది.

– బాల బ్రహ్మచారి, రథ శిల్పి

భక్తుల విరాళాలు అవసరం

నీలకంఠేశ్వర ఆలయానికి కొత్త రథం చేయిస్తున్నాం. దీనికి అవసరమయ్యే నిధులు ఇప్పటివరకు రూ.50 లక్షలు భక్తుల నుంచి విరాళాలుగా సేకరించాం. ఈ నిధులు సరిపోవు. మరిన్ని నిధులు అవసరం ఉండటంతో భక్తులు రథం తయారీ కోసం విరాళాలు అందజేయాలి.

– బిల్లా మహేష్, ఆలయ చైర్మన్

నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న అలుక కిషన్

- టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్

సుభాష్‌నగర్: కోటగిరిలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు, ఎంప్లాయీస్ జేఏసీ జిల్లా చైర్మన్ అలుక కిషన్ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని టీఎన్‌జీవో భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్‌పై జరిగిన దాడిని ఎంప్లాయీస్ జేఏసీ పక్షాన తీవ్రంగా ఖండించారు. అనంతరం అలుక కిషన్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు, ఉద్యోగులపై దాడులు జరిగితే ఎంతటి వారైనా ఉపేక్షించబోమని హెచ్చరించారు. దాడులు పునరావృతం కాకుండా చూడాలని, ఇలాగే పునరావృతమైతే జేఏసీ పక్షాన నిరసనలు తెలియజేసే కార్యాచరణను ప్రకటిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సంఘం అమృత్‌కుమార్, నాయకులు చిట్టి నారాయణరెడ్డి, వెంకటేశం, శేఖర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

నిజామాబాద్ సిటీ/మోపాల్/ఇందూరు/ధర్మారం :మాజీ ముఖ్యమంత్రి, సినీ నటుడు ఎన్టీ రామారావు వర్ధంతిని జిల్లాలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పలువురు రక్తదానం చేశారు. ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా నేతలు కొనియాడారు.



ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కమ్మ సంఘం పాలకవర్గం సభ్యులు

సమాచారం..

నేడు మల్లారంలో కంటి వెలుగు

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం మల్లారం గ్రామంలో గురువారం కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభం కానుంది. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉదయం 8.30 గంటలకు మండల ప్రజాప్రతినిధులు, మండల అధికారులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. అన్ని ఏర్పాట్లు చేసినట్లు గ్రామ సర్పంచ్ నగేష్ తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిజామాబాద్‌నాగారం: నగరంలోని మాలపల్లి ప్రాంతంలో రిలయన్స్ పెట్రోల్ పంపు వద్ద మున్సిపల్ డ్రైనేజ్ వర్క్ జరుగుతున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ నగర టౌన్-1 ఏడీఈ చంద్రశేఖర్ బుధవారం తెలిపారు. ఈ ప్రాంతంలో ఎలక్ట్రిక్ పోల్స్‌ను పక్కకు జరపడానికి గురువారం ఉదయం 11 గంటల నుంచి 5 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. సీఎం రోడ్, టెలిఫోన్ కాలనీ, ఆటోనగర్, మాలపల్లి, ముజాహిద్ నగర్, ఫ్రూట్ మార్కెట్, హబీబ్ నగర్, చార్ బై పెట్రోల్ బంక్ ఏరియాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్: నాగారం మైనారిటీ గురుకుల బాలుర పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశాలకు, అలాగే 6, 7, 8 తరగతులకు సంబంధించి ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కిరణ్‌గౌడ్ తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులకు ఈనెల 30 వరకు అడ్మిషన్లు కొనసాగుతాయన్నారు.

మహిపాల్ రెడ్డి వర్ధంతి



బాల్కొండ: మాజీ మంత్రి ఏలేటి మహిపాల్ రెడ్డి వర్ధంతిని బుధవారం బాల్కొండ, ముప్కాల్ మండల కేంద్రాల్లో బీజేపీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ముప్కాల్ మండల కేంద్ర శివారులో ఇటుక బట్టీల వద్ద పిల్లలకు, బాల్కొండ మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్, మండలాల అధ్యక్షులు అంబటి నవీన్, గిరిస్వామీ, నేతలు విక్రమ్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

బట్టీల్లో కార్మికుల సంక్షేమం గాలికి..

బాల్కొండ: ఇటుక బట్టీల్లో కార్మికుల సంక్షేమం గాలికి వదిలేస్తున్నారు. బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలో ఇష్టారీతిన ఇటుక బట్టీలను నిర్వహిస్తున్నారు. కార్మిక సంక్షేమ చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. గతంలో మండలంలోని ఇత్వార్‌పేట్ శివారులో ఇటుక బట్టీలో పనిచేసే కార్మికుడు ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందాడు. ఇలా కార్మికులు ప్రమాదాల్లో చనిపోతున్న నిర్వాహకులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఇటుక బట్టీల వద్దనే గుడిసెల్లోనే నివాసం ఉంటూ కార్మికులు పనులు చేపడుతున్నారు. ఇటుక బట్టీల యజమానులు తమ కార్యాలయాల కోసం, స్టోర్ రూంల కోసం రేకుల షెడ్లు ఏర్పాటు చేస్తున్నారు. కానీ తమ కోసం కనీస సౌకర్యాలు కూడా ఏర్పాటు చేయడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజు వారీ వేతనాల్లో కూడా కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. ఎంత వేతనం వస్తుందో కూడా కూలీలకు తెలియని పరిస్థితి. ప్రధానంగా ఒరిస్సా, ఆంధ్ర ప్రాంతం నుంచి కూలీలు వచ్చి ఇటుక బట్టీలో పనులు చేస్తున్నారు. మధ్యవర్తుల ద్వారా ఇటుక బట్టీల్లో పని చేస్తున్నట్లు కార్మికులు తెలిపారు. ఒక్క ఇటుక బట్టీకి కూడా ఎలాంటి అనుమతులు లేవని రెవెన్యూ అధికారులు కుండబద్దలు కొడుతున్నారు. కానీ ఇంత వరకు ఎవరిపై చర్యలు చేపట్ట లేదు. ఉన్నతాధికారులు స్పందించి కార్మికుల హక్కులను కాపాడాలని పలువురు కోరుతున్నారు.



ఇటుక బట్టీల వద్ద కార్మికుల కోసం ఏర్పాటు చేసిన గుడిసెలు

కంటి వెలుగుకు సర్వం సిద్ధం



ధర్పల్లిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

ధర్పల్లి: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో నటరాజ్ అన్నారు. ధర్పల్లి మండల కేంద్రంలోని బీసీ హాస్టల్, రామడుగు, మోబిన్‌సాబ్ తండాలో కంటి వెలుగు వైద్య శిబిరాలను బుధవారం సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. కంటి వెలుగు కార్యక్రమం ఏర్పాట్లన్నీ పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. కంటి వెలుగు కార్యక్రమం గురువారం ఉదయం ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు తమ తమ గ్రామ పంచాయతీ పరిధిలో కంటి పరీక్షలు చేయించుకుని ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్న మందులు, కళ్లజోళ్లను పొందాలని సూచించారు. తహసీల్దార్ గంగాసాగర్, ఎంపీవో రాజేష్ ఉన్నారు.

కార్పొరేట్ శక్తులను తరిమికొడదాం



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

- ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్

ఖలీల్‌వాడి: వ్యవసాయంలో కారొపరేట్ శక్తులను తరిమికొట్టాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు చంద్రశేఖర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రం కోటగల్లిలోని ఎన్ఆర్‌భవన్‌లో ఏఐకేఎంఎస్ జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ముందుగా ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు గంగాధర్, జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం చంద్రశేఖర్ మాట్లాడుతూ.. చేనులో ఉండాల్సిన రైతు ఏడాదంతా దేశ రాజధాని ఢిల్లీలో రోడ్లమీద నివసిస్తున్నారన్నారు. వ్యవసాయ రంగాన్ని పెట్టుబడిదారులకు కట్టబెట్టడాన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా రైతులు ఆందోళన చేస్తున్నారన్నారు. కేంద్రం వ్యవసాయ రంగాన్ని తీవ్రమైన సంక్షోభంలోకి నెట్టి బడా కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పే విధానాలను అవలంబిస్తోందన్నారు. ఈ సమావేశంలో ప్రభాకర్, దేవారం తదితరులు ఉన్నారు.

కల్తీకల్లు నిర్మూలనకు చర్యలు తీసుకోండి



వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

సుభాష్‌నగర్: నగరంలో డైజోఫామ్, క్లోరోఫామ్, ఆల్ప్రోజోలంతో కృత్రిమ కల్లు తయారు చేస్తూ ప్రజలను మత్తుకు బానిసలుగా మారుస్తున్నారని, వెంటనే కల్తీ కల్లు అరికట్టాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు కమలాపురం రాజన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం నగరంలోని కలెక్టరేట్‌లోగల సూపరిటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం రాజన్న మాట్లాడుతూ.. రసాయనాలతో కృత్రిమంగా వేలాది లీటర్లను తయారు చేస్తూ రూ.లక్షలు సొమ్ము చేసుకుంటున్నారని, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. అనేక మంది కల్లుకు బానిసై ఆరోగ్యం చెడగొట్టుకుంటున్నారని, కార్మికులు జీవనోపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి రేట్లు పెంచి డబ్బులు దండుకుంటున్నారని, ఎక్సైజ్ అధికారులు కళ్లు మూసుకుంటున్నారని విమర్శించారు. వెంటనే కల్తీ కల్లుపై ఉక్కుపాదం మోపాలని, లేకుంటే సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామన్నారు. నాయకులు మేకల సాయిలు, బాలయ్య, సాయిలు ఉన్నారు.

మానసిక ప్రశాంతతతోనే శక్తి



నిజామాబాద్‌సిటీ: ప్రతి ఒక్కరూ మానసిక ప్రశాంతత కలిగి ఉంటే శక్తి పొందుతారని బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విద్యాలయం నాందేవ్‌వాడ శాఖ నిర్వాహకురాలు సునీత బహెన్ జీ అన్నారు. బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విద్యాలయం సంస్థ ఫౌండర్ ప్రజాపిత బ్రహ్మ సంపూర్ణతను పొందిన రోజుగా విశ్వశాంతి దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	56,900	వెండి (కిలో)	70,700
22 క్యారెట్స్	52,450	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	6	12	క్యాప్సికం	30	50
బెండకాయ	70	90	గాజరుగడ్డ	20	40
బీరకాయ	60	80	పచ్చిమిర్చి	30	50
దొండకాయ	30	50	దోసకాయ	30	50
బీర్నిసుకాయ	35	60	ఆలుగడ్డ	20	40
కాకరకాయ	30	50	గోబిగడ్డ	10	20
వంకాయ	40	60	గోబిపువ్వు	20	30
పాలకూర	20	40	బీట్‌రూట్	20	40
మెంతికూర	30	50	గోరు చిక్కుడు	50	65
కొత్తిమీర	20	40	చిక్కుడుకాయ	40	60
పుదీనా	30	50			

– ఇందూరు

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	220
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	750

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)
స్క్రీన్-1- వారసుడు -1.10,7.30
వీరసింహారెడ్డి - 4.20,10.40
స్క్రీన్-2-వీరసింహారెడ్డి - 10.10,1.20,7.40
వారసుడు-4.30 10.45
స్క్రీన్-3- వాల్తేరు వీరయ్య -10.30,1.30 4.30,7.30,10.30
పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)
స్క్రీన్-1-వాల్తేరు వీరయ్య -9.30,12.50,4.10 7.30,10.50
స్క్రీన్-2-వారసుడు-9.30,3.30,7.00,10.30
కళ్యాణం...కమనీయం -1.00
స్క్రీన్-3-వీరసింహారెడ్డి -9.00,4.00, 7.30 11.00 -వారసుడు -12.30
స్క్రీన్-4- వాల్తేరు వీరయ్య -10.20
వీరసింహారెడ్డి -1.40
తెగింపు -5.10,10.50
కళ్యాణం...కమనీయం...-8.20
దేవి వీరసింహారెడి
నటరాజ్ ధమాకా
లలితామహల్ వాల్తేరు వీరయ్య
శ్రీదేవి ధమాకా
విజయ్ వారసుడు

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
యం. మధుసూధన్ (ACO) : 9951027699
నిజామాబాద్ అర్బన్ & రూరల్ రాంబాబ్ : 7997958181
ఆర్మూర్ శివ : 9848956776 & బాల్కొండ ప్రశాంత్ : 8919850800
బోధన్ వి. మల్లికార్జున (ACM) : 70955 23222
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899